క్లుప్తంగా

విద్యా వలంటీర్లను నియమించాలి

మీర్‌పేట: జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది. జిల్లాలోనే అత్యధిక విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలల్లో ఇది ఒకటి. కాగా విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో ప్రతీ సంవత్సరం ఉన్న వారితోనే అదనపు తరగతులు బోధిస్తూ నెట్టుకురావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు విద్యా వలంటీర్లను నియామకానికి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

వాహనాల అద్దె చెల్లించాలని వినతి



ప్రజావాణికి హాజరైన వాహనదారులు

కందుకూరు: వెలుగు ప్రోగ్రాంకు తిప్పిన 84 వాహనాల అద్దె చెల్లించాలని సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అద్దె ప్రాతిపదికన 84 వాహనాలను వెలుగు కార్యక్రమానికి వినియోగించుకున్నారని.. ఒక్కొక్కరికి రెండు నెలల బిల్లులు అందలేదని.. త్వరగా బిల్లులు మంజూరు చేయాలని వాహనాదారులు కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

కందుకూరు: మండల పరిధిలోని రాచూలూరులోని శ్రీ శివరామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వేద బ్రాహ్మణుల సమక్షంలో ఉదయం నుంచి స్వామి వార్లకు అభిషేకం, పూజలు, అనంతరం హోమం చేశారు. మధ్యాహ్నం పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

తండ్లాట తీరింది

'జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం' నివాసితుల హర్షం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయాల్లో కొంత కాలంగా తాగునీరు లేక అక్కడి నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల దృష్టికి తీసుకువచ్చారు. ఏళ్ల నుంచి తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతన్నా పాలకులు పట్టించుకోలేదు. ఈ రోజు తాగునీరు విడుదలవ్వడంతో ఈ ఘనత మాదంటే.. మాదేనని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు చెప్పుకొంటున్నాయి. ఎవరైతే ఏమీ మా కష్టాలు తీరాయంటూ 4వేల కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఎమ్మెల్యే సబితారెడ్డి హెచ్‌ఎండబ్ల్యూఎస్ రివ్యూ కారణంగా నీటిని విడుదల చేశారని బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రచారం చేస్తుండగా.. ఏళ్ల తండ్లాటను మేయర్ పారిజాత మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లడంతోనే సమస్య పరిష్కారమైందని కాంగ్రెస్ నాయకులు కౌంటర్ ఇస్తున్నారు.

దొంగను పట్టించిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్

నాగోలు: చోరీలకు పాల్పడుతున్న జేబు దొంగల ముఠాలోని ఓ సభ్యుడిని ఆర్టీసీ బస్ డ్రైవర్, కండక్టర్ పోలీసులకు పట్టించారు. ఎల్‌బీనగర్ డీఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 22న హయత్‌నగర్-1 టీజీఎస్ ఆర్టీసీ బస్ దిల్‌సుఖ్‌నగర్ నుంచి చౌటుప్పల్‌కు వెళుతోంది. ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ఏడుగురు బస్సులోకి ఎక్కారు. వారు 19న అదే బస్సులో ప్రయాణించి తుప్రాన్‌పేట వద్ద బస్సు దిగిన ఓ వృద్ధ ప్రయాణికుడి వద్ద రూ.50 వేలు లాక్కుని పారిపోయారు. అయితే బస్సులో ఎక్కిన నిందితులను బస్సు డ్రైవర్ చక్రపాణి, కండక్టర్ జయశ్రీ గుర్తు పట్టారు. డ్రైవర్ చక్రపాణి బస్సు నిలిపి 19న వృద్ధుడి వద్ద డబ్బులు కొట్టేసింది మీరే కదా అనడంతో వారు వెంటనే బస్సు దిగి పరారవుతుండగా వారిలో ఒకడిని పట్టుకుని తొలుత హయత్‌నగర్ ఠాణాలో అప్పగించారు. ఎల్‌బీనగర్ డిటెక్టివ్ పోలీసులు అతడిని అరెస్టు చేసి విచారించగా అతడు భువనగిరి టౌన్‌కు చెందిన కొమ్ము ప్రశాంత్(24) అని, జేబు దొంగల ముఠా సభ్యుల్లో ఒకడని గుర్తించారు. అతడిపై ఉస్మానియా పీఎస్‌లో 5, ఎల్‌బీనగర్‌లో 2, ఉప్పల్1, యాదగిరిగుట్ట పీఎస్ పరిధిలో కేసులున్నాయని విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. ఎల్‌బీనగర్ పోలీసులు ప్రశాంత్‌ను సోమవారం రిమాండ్‌కు తరలించారు.

మట్టి మాయం!

- ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో జోరుగా తవ్వకాలు
- రాత్రివేళ యథేచ్ఛగా తరలింపు
- ఎస్‌ఓటీ దాడులు చేసినా మారని తీరు



గంగారంలో ప్రభుత్వ భూమిలో చేపట్టిన తవ్వకాలు



టిప్పర్లలో తరలిస్తున్న అక్రమార్కులు

మహేశ్వరం: మండల పరిధిలో మట్టి అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, చెరువులు, కుంటల్లో మట్టిని ఇష్టానుసారంగా తవ్వేస్తూ రియల్ వ్యాపారులు, ఇటుక బట్టీ వ్యాపారులు, ఇళ్ల నిర్మాణాలకు విక్రయిస్తున్నారు. పెద్ద ఎత్తున సాగుతున్న ఈ అక్రమ దందాపై రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఎస్‌ఓటీ దాడులు నిర్వహించి జరిమానాలు వేసి కేసులు నమోదు చేసినా అక్రమార్కుల తీరు మారడం లేదు. మండల పరిధిలోని గంగారం, ఉప్పుగడ్డ తండా, కావలోని బాయి తండా, నాగిరెడ్డిపల్లి, కోళ్లపడకల్, దుబ్బచర్ల, ఆకన్‌పల్లి, కొత్త తండా, తుమ్మలూరు, సిరిగిరిపురం,"కల్వకోల్ గ్రామాల్లో అసైన్డ్, చెరువు శిఖం, ప్రభుత్వ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా జేసీబీలు, ఇటాచీలతో మట్టిని తవ్వేసి టిప్పర్లలో నింపి అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో కొనసాగే ఈ అక్రమ దందా మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నట్లుగా కొనసాగుతోంది. టిప్పర్లలో మట్టి తరలిస్తున్న క్రమంలో గ్రామాలు,తండాల్లో రోడ్లు దెబ్బతింటున్నాయి. రాత్రి వేళ వాహనాలు తిరుగుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

గుంతలుగా మారుతున్న పొలాలు

టీజీఐఐసీ అధికారులు ఐటీ పార్కు ఏర్పాటుకు సేకరించిన ప్రభుత్వ అసైన్డ్ భూముల్లోనూ అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. తమ భూములు టీజీఐఐసీ తీసుకోవడంతో రైతులు మట్టిని అమ్ముకుంటే డబ్బులు వస్తాయనే ఆలోచనతో విక్రయించడంతో పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వ పరిహారంతో పాటుగా మట్టికి సైతం డబ్బు వస్తుండడంతో రైతులు అక్రమార్కులకు అండదండగా ఉంటూ మట్టి విక్రయించుకుంటున్నారు.

ముడుపులు చెల్లించి ముందుకు

రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు వందల టిప్పర్లు, ఇటాచీలు, జేసీబీలు పెట్టి మట్టిని యథేచ్ఛగా తవ్వేసి తరలిస్తున్నారు. మట్టిని ఇటుక బట్టీలు, ప్రైవేట్ వెంచర్లలో చదును చేయడానికి టిప్పర్‌కు రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొంత మంది రాజకీయ పార్టీలకు చెందిన నేతలు వెనుకుండి వీరిని ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ నేతలే రెవెన్యూ, మైనింగ్ అధికారులు, పోలీసులకు ఫోన్లు చేసి అటుగా రావొద్దంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రశ్నిస్తున్న ప్రజలకు ఎంతో కొంత ఇచ్చి నోరు మూపిస్తున్నారని.. గట్టిగ అడిగితే దాడులకు సైతం వెనుకాడడం లేదంటున్నారు. గ్రామస్థాయి నేతలకు సైతం ముడుపులు చెల్లించి దందా ముందుకు సాగుతోందని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు, పోలీసులు మట్టి మాఫియాపై గట్టి నిఘా పెట్టి మట్టి తవ్వకాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం



ప్రభుత్వ, అసైన్డ్, శిఖం భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. తవ్వకాలు చేపట్టిన రైతు భూమిని పీఓటీ(ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) కింద తీసుకుని మట్టి తరలిస్తున్న జేసీబీలు, టిప్పర్లు సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తాం. రెవెన్యూ అధికారులు ఎన్నికల విధుల్లో ఉండగా అక్రమార్కులు మట్టి తరలించారని తమ దృష్టికి వచ్చింది. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాల్టా చట్టం కింద కేసులు చేస్తాం.

– సూరజ్ కుమార్, ఆర్డీఓ, కందుకూరు

భూముల కబ్జా వెనుక ఎమ్మెల్యే

- బీఆర్‌ఎస్ నేతలకు కోట్ల విలువ చేసే ప్లాట్లు, ఇళ్ల స్థలాలు
- అనర్హులు, స్థానికేతరులకు ఇళ్ల పట్టాలు, డబుల్ బెడ్రూమ్స్
- త్వరలో ముఖ్యమంత్రికి వివరిస్తా
- ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్



మాట్లాడుతున్న సునీతానాయక్

మహేశ్వరం: మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి సహకారంతో మండల పరిధిలో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్.సునీతా నాయక్ ఆరోపించారు. సోమవారం ఆమె మండల కేంద్రంలోని ఎంపీపీ చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా సునీతానాయక్ మాట్లాడుతూ.. మన్సాన్‌పల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 136, 140 నంబర్లలో ప్రభుత్వ భూమిని మాజీ మంత్రి సబితారెడ్డి అనుచరులకు కట్టబెట్టారన్నారు. ఆమె మంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వ భూముల్లో బీఆర్‌ఎస్ నేతలకు ప్లాట్లు ఇచ్చి కబ్జాకు అదేశాలిచ్చారన్నారు. మహేశ్వరం, మన్సాన్‌పల్లి రెవెన్యూ పరిధిలోని విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. బీఆర్‌ఎస్ నేతల కబ్జాలపై కాంగ్రెస్ చర్యలు తీసుకుంటుందని చెప్పారు. బీఆర్‌ఎస్ నేతలు, సానుభూతి పరులకు, అనర్హులకు ప్రభుత్వ ఇళ్ల స్థలాలు కట్టాబెట్టారన్నారు. మన్సాన్‌పల్లిలో డబుల్ బెడ్ రూమ్స్‌ను స్థానికేతరులకే కేటాయించారన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ భూములు, శిఖం, అసైన్డ్ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు చేస్తున్నారని రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు దృష్టి సారించి అరికట్టాలన్నారు. అధికారులు ప్రభుత్వ భూములను గుర్తించి కబ్జాకు గురైన భూమలను స్వాధీనం చేసుకుని ఆ భూముల్లో బోర్డులు పెట్టి రక్షణ కంచె ఏర్పాటు చేయాలన్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, జిల్లా కలెక్టర్‌ల దృష్టికి కబ్జాల విషయం తీసుకెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు.

వివాహిత హత్య

మృతురాలి భర్త కోసం గాలింపు

చైతన్యపురి: వివాహిత హత్యకు గురైన ఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన ప్రకారం.. అన్వర్, మహమ్మద్ గౌసియా (30) భార్యాభర్తలు. వీరు చంపాపేట బృందావన్ కాలనీలో అద్దె కుంటున్నా రు. వీరు నిత్యం మద్యం తాగి గొడవ పడుతుండేవారు. ఆదివారం సాయంత్రం ఇంటి పక్కన ఉండే మహిళ గౌసియాను పిలువగా పలకలేదు. దీంతో లోనికి వెళ్లి చూడగా గౌసియా అపస్మారక స్థితిలో పడి ఉంది. ఆమె చుట్టుపక్కల వారిని పిలిచి విషయం చెప్పింది. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి పరీక్షించారు. అప్పటికే గౌసియా మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేశారు. మృతురాలి మెడ చుట్టూ, రెండు చేతులకు గాయాలు ఉన్నట్లు గుర్తించారు. గౌసియాను అన్వర్ హత్యచేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పరారీలో ఉన్న అన్వర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.



కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకుల ధర్నా

పెండింగ్ వేతనాలు చెల్లించండి

సీఐటీయూ నాయకుల డిమాండ్

మీర్‌పేట: ఉద్యోగ భద్రతతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకులు దాసరి బాబు, యాదయ్య మాట్లాడుతూ.. ఏడాది క్రితం కాంట్రాక్ట్ పద్ధతిలో 40 మంది కార్మికులను నియమించి, ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌సీఐ, మీర్‌పేట ప్రధాన రహదారుల్లో కార్మికులు విధుల్లో ఉండగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని.. వారికి ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ కార్మికురాలు తీవ్రంగా గాయపడినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. అనంతరం మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఆమె శనివారం వరకు వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. సోమవారం లోగా వేతనాలు చెల్లించని ఎడల కార్మికులతో కలిసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీఐటీయూ మీర్‌పేట కన్వీనర్ శేఖర్‌యాదవ్, నాయకులు ఆంజనేయులు, నర్సింహ, ఈశ్వరమ్మ, మల్లమ్మ, సరిత, సుధ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రైతు పక్షపాతి

పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతిగా పని చేస్తున్నారని పీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. సీఎం రైతు రుణమాఫీ ప్రకటన విడుదల చేసిన నేపథ్యంలో సోమవారం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్, జగ్జీవన్‌రాం చౌరస్తాలో మిఠాయి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం చేసిన రుణమాఫీ రైతుల వడ్డీకే సరిపోలేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యాచారం జంగయ్య, అంధ్యానాయక్, లాజర్, జంగయ్య, కుమార్, బాల్‌రాజ్, రాజు నాయక్, కృష్ణ నాయక్, ఆవుల యాదయ్య, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మిఠాయిల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

మానవ అక్రమ రవాణాను అరికడదాం

- ప్రజ్వల సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బలరామ కృష్ణ
- మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ

తలకొండపల్లి: మానవ అక్రమ రవాణా అరికట్టడంలో అందరూ కలిసి కట్టుగా పనిచేయాల్సిన అవసరముందని ప్రజ్వల సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బలరామ కృష్ణ అన్నారు. హైదరాబాద్ ప్రజ్వల సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏపీఎం శ్రీదేవి సౌజన్యంతో సోమవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మానవ అక్రమ రవాణా అనే అంశంపై.. పొదుపు సంఘం మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బలరామ కృష్ణ, శ్రీదేవి మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం 28 సంవత్సరాలుగా ప్రజ్వలన సంస్థ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. లైగింక వ్యాపారానికి వ్యతిరేకంగా పని చేస్తున్న 28,500 మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సంస్థ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సునీత కృష్ణన్ ఆడ పిల్లల రక్షణ నిమిత్తం, మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక ప్రోత్సాహిక కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. అనంతరం మానవ అక్రమ రవాణా రకాలు, సైబర్ ట్రాఫికింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఏలాంటి మోసాలు జరుగుతున్నాయో, తదితర అంశాలపై చర్చించి అర్థమగు రీతిలో చక్కగా వివరించి అవగాహన కల్పించారు. లఘు చిత్రాలు, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, గ్రూప్ డిస్కస్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీదేవి, సీసీలు లక్ష్మయ్య, రామయ్య, సుధారాణి, చెన్నయ్య, ప్రజ్వలన సిబ్బంది సురేష్ కుమార్, అనిల్, అంబర్ సింగ్, మిథాళి రాజ్, అనిల కుమార్, వీఓఏలు నరసింహ, కల్పన, బాగ్యలక్ష్మీ, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులకు నిరసన

కందుకూరు: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని కోరుతూ జిల్లా ఐక్య ఉపాధ్యాయ వేదిక పిలుపు మేరకు సోమవారం గూడూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎండీ బషీర్ మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లో తెలుగు, హిందీ, ఉర్దూ భాషోపాధ్యాయులు అప్‌గ్రేడేషన్ జరిగి పదోన్నతి పొందుతుంటే, రంగారెడ్డి జిల్లాలో క్యాడర్ స్ట్రెంత్ కారణంగా ఆగిపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం స్పందించి భాషా పండితులతో పాటు అందరు ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండీ ఆయూబ్, మృణాళిని, ఓంకారం, శ్రీదేవి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

317 జీఓ ద్వారా క్యాడర్ స్ట్రెంత్‌కి మించి అదనంగా జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులు, వివిధ కారణాలు చూపుతూ దొడ్డి దారిన వచ్చిన ఉపాధ్యాయులను తిరిగి పంపించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక మండల అధ్యక్షుడు డాక్టర్ ఎడ్ల కల్లేశ్, కార్యదర్శులు డాక్టర్ బుగ్గ రాములు, డాక్టర్ బషీర్, జి.నాగేందర్ మాట్లాడారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో బదిలీలు, పండిట్, పీఈటీలకు పదోన్నతులు జరిగాయని, జిల్లాలో అర్హత ఉన్నవారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ప్రస్తుత షెడ్యూల్ లోనే ప్రభుత్వం సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎల్.జంగయ్య, హెచ్.జంగయ్య, డి.కృష్ణయ్య, ఎస్.అంబదాస్, పి.రాజేశ్వర్, కె.గోవర్ధన్, కె.గోపాల్, యు.లావణ్య, వనజ, ఉమా, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు



గూడూరు పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

లైంగిక దాడి కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: మైనర్ బాలిక పట్ల లైంగిక దాడికి యత్నించిన బి.మల్లికార్జున్(46)కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష తోపాటు 10వేల రూపాయలు జరిమానాను రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె. పద్మావతి విధించారు. కోర్టు పిపి సునితా బర్ల తెలిపిన కథనం మేరకు వివరాలివి...మీర్‌పేట్ ఠాణా పరిధిలో మైనర్ బాలిక తన తల్లితో కలిసి నివసించేది. బాలిక తల్లి తన సోదరుని అంత్యక్రియల కోసం మెనర్ బాలికను తోటికోడలు ఇంట్లో వదిలి వెళ్లింది. అదే ఇంట్లో నివసించే నిందితుడు మల్లికార్జున్ బాలికపై లైంగిక దాడికి పాల్పడేందుకు ప్రయత్నించగా తన తల్లితో విషయాన్ని తెలిపింది. దీంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మీర్‌పేట్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, సాక్షులను విచారించిన కోర్టు శుక్రవారం విధించారు.

వరిసాగుపై రైతులకు అవగాహన

ఆమనగల్లు: మండల పరిధిలోని రాంనుంతలలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు.. రైతులకు వరిపంట సాగుపై అవగాహన కల్పించారు. విత్తనాల ఎంపిక, మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్ష, పంటసాగు, ఎరువుల వాడకం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు దామోదరరాజు, పవన్ చంద్రారెడ్డి.. రైతులకు వివరించారు. రాంనుంతల గ్రామాన్ని దత్తత తీసుకుని రాబోయే మూడు సంవత్సరాల వరకు రైతులు చేసే పంటసాగుకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ ఆదిలక్ష్మి, వ్యవసాయాధికారి అరుణకుమారి, ఏఈఓలు శివతేజ, మీనాక్షి, రైతులు సత్తయ్య, నర్సింహ, యాదయ్య, నారయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ప్రవేశాలు

యాచారంలో ప్రైవేట్ పాఠశాల ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ నేతల ధర్నా

యాచారం: నింబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా యాచారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలను వెంటనే మూసివేయడంతో పాటు ఆ పాఠశాల యజమాన్యంపై కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు డిమాండ్ మండల కేంద్రంలో సదరు పాఠశాల భవనం ఎదుట సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. సదరు ప్రైవేట్ పాఠశాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవని, అయినా పాఠశాల యజమాన్యం గత రెండు నెలల నుంచి అడ్మిషన్లు స్వీకరిస్తోందని.. రూ.వేలాది ఫీజులు వసూల్ చేస్తుందని అన్నారు. అడ్మిషన్లు, పాఠ్యపుస్తకాల పేరుతో దోపిడీకి పాల్పడుతన్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. ఎస్‌ఎఫ్‌ఐ శ్రేణులను సముదాయించే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి స్పందించి.. కార్యాలయ సిబ్బంది ద్వారా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సదరు పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవని.. తల్లితండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించవద్దని పాఠశాల గోడకు నోటీసును అంటించారు. దీంతో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తమ ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్, ఇబ్రహీంపట్నం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, తరంగ్, ఉపాధ్యక్షుడు విప్లవ్‌కుమార్, నాయకులు.. శ్రీకాంత్, లిఖిత్‌కుమార్, రాకేష్, శివ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ఫ్లైఓవర్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, భద్రత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద నూతనంగా నిర్మాణం జరుపుకుంటున్న ఫ్లైఓవర్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 850 మీటర్ల మేరా ఫ్లైఓవర్ నిర్మాణం జరుగనుందని, చింతలకుంటపై ఎల్కట్రానిక్స్ నుంచి ప్రారంభమై సుష్మా చౌరస్తా దాటిన తర్వాత ముగుస్తుందని అన్నారు. ఈ ఫ్లైఓవర్ పూర్తయితే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు ఉండవని అన్నారు. అలాగే చంపా పేట డీమార్ట్ దగ్గర ఒక ఫ్లైఓవర్, బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా వద్ద మరో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేయడం జరిగిందని అన్నారు.

ఇళ్ల కోసం కలెక్టర్‌కు వినతి

ఇబ్రహీంపట్నం రూరల్: కర్మన్‌ఘాట్ నందనవనం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఆ సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ శశాంకను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఇదివరకు రాష్ట్ర ప్రభుత్వం నందనవనంలో నిర్మించి అందజేసిన జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో 275 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేస్తే వాటిలో కొంతమంది.. రాజకీయ నాయకులు అండతో కబ్జా చేశారని వాపోయారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో మాపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. గిరిజన, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలకు అందజేసిన ఫ్లాట్లు న్యాయబద్ధంగా వారికే కేటాయించాలని కోరారు. వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం చూపిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు లబ్ధిదారులు తెలిపారు.